క్లుప్తంగా

26న అంబేడ్కర్ రాజ్యాంగ ఆమోద దినోత్సవం నిర్వహించాలి

ఒంగోలు ఒన్‌టౌన్: బాబా సాహెబ్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాజ్యాంగ ఆమోద దినోత్సవం ఈ నెల 26న నిర్వహించాలని దళిత హక్కుల పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు నీలం నాగేంద్రరావు కోరారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మోదీ ప్రభుత్వం మొదటిగా 2016లో అంబేడ్కర్ రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని గుర్తించి దేశ వ్యాప్తంగా నిర్వహించిందన్నారు. కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో 26న అంబేడ్కర్ రాజ్యాంగ దినోత్సవంగా నిర్వహించాలని నాగేంద్రరావు విజ్ఞప్తి చేశారు.

రేపు దివ్యాంగుల వనభోజనాలు

ఒంగోలు టౌన్: నగరంలోని సంతపేట ఐసీసీ సోషల్ యాక్ట్స్ దివ్యాంగుల వసతి గృహంలో కార్తీక మాసాన్ని పురస్కరించుకొని ఆదివారం దివ్యాంగుల వన భోజనాలు ఏర్పాటు చేసినట్లు చిట్టి శ్రీనివాసరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం అనంతరం ఎన్ఎఫ్‌బీ (ఐ) నూతన కార్యవర్గం ఎన్నిక ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి బి.ఓబులేసు, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు జి.అర్చన, డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు, టూటౌన్ సీఐ మేడా శ్రీనివాసరావు, అసిస్టెంట్ ఆర్ఎంఓ డాక్టర్ అనిల్‌కుమార్, జిల్లా పంచాయతీ అధికారి వెంకట్ నాయుడు ముఖ్య అతిథులుగా హాజరవుతారని తెలిపారు. దివ్యాంగుల కార్తిక వన భోజనాలను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

వాహనాల తనిఖీ

సంతనూతలపాడు: ఒంగోలు రూరల్ సీఐ ఎన్.శ్రీకాంత్‌బాబు ఆధ్వర్యంలో సంతనూతలపాడు మెయిన్ రోడ్డుపై శుక్రవారం వాహనాలను పోలీసులు తనిఖీ చేశారు. మొత్తం 21 వాహనాలకు జరిమానా విధించారు. లైసెన్స్ లేని టిప్పర్లు, అధిక లోడుతో వెళ్తున్న ఆటోలు, ట్రిపుల్ రైడింగ్ చేస్తున్న మోటార్ సైకిళ్లకు సుమారు రూ.35 వేల అపరాధ రుసుం విధించారు.

సనాతన ధర్మం పేరుతో విషయం పక్కదారి

- సీపీఎం రాష్ట్ర నేత జాలా అంజయ్య

ముండ్లమూరు (దర్శి): సనాతన ధర్మం పేరుతో ప్రజల అసంతృప్తిని పక్కదారి పట్టిస్తున్నారని సీపీఎం రాష్ట్ర నాయకుడు జాలా అంజయ్య అన్నారు. మండలంలోని వేంపాడులో సీపీఎం మండల నాలుగో మహాసభలు పంటా ఏడుకొండలు అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా హాజరైన జాలా అంజయ్య మాట్లాడుతూ జరిగిన ఎన్నికల్లో బీజేపీకి ప్రజలు తగిన మెజార్టీ ఇవ్వలేదన్నారు. ఎన్‌డీఏ పక్షాల మద్దతుతో ప్రభుత్వం ఏర్పడినా గత ఆర్థిక విధానాలను దూకుడుగా అమలు చేస్తోందని, కార్పొరేట్ల కోసం జెమిలి ఎన్నికలు అంటూ రాజ్యాంగ ప్రజల స్ఫూర్తిని దెబ్బతీస్తోందన్నారు. సనాతన ధర్మం పేరుతో హిందుత్వ అంజెండాను ప్రజలపై రుద్దుతుందని చెప్పారు. పౌర హక్కులను, ప్రజా ఉద్యమాలను కాలరాసేందుకు చట్టాన్ని తెచ్చి రాజ్యాంగ సంస్థలను అడ్డం పెట్టుకుని ప్రాంతీయ పార్టీలను బెదిరిస్తూ రాష్ట్రాల హక్కులు బీజేపీ హరిస్తోందన్నారు. టీడీపీ కూటమి ఇచ్చిన హామీల అమలుకు పూనుకోవాలని జాలా అంజయ్య డిమాండ్ చేశారు. మండలంలో కందుల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని, వరి భూములకు సాగర్ జలాలు అందించాలని, గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించాలని, క్రాప్ ఇన్సూరెన్స్‌లో ఓట్బీజీ సమస్యల పరిష్కారం కోసం సీపీఎం కృషి చేస్తోందన్నారు. నాయకులు తాండవ రంగారావు, హనుమంతరావు పాల్గొన్నారు.

సభలు సరే.. పరిష్కారాలు ఏవీ.?

- రెవెన్యూ రీ సర్వే సమస్యలపై గ్రామాల్లో సభలు
- అర్జీలు స్వీకరించి పక్షం రోజులు దాటినా కనిపించని పరిష్కారాలు
- నాగులుప్పలపాడు మండలంలో 100కుపైగా పెండింగ్‌లో అర్జీలు
- రిజిస్ట్రేషన్లపై నేటికీ గందరగోళం
- ఆందోళనలో రైతాంగం

నాగులుప్పలపాడు:

రెవెన్యూ రీ సర్వే సమస్యలపై నాగులుప్పలపాడు మండలంలోని గ్రామాల్లో సభలు ముగిసినప్పటికీ నేటికీ ఒక్క సమస్యను కూడా పరిష్కరించిన దాఖలాలు కనిపించడం లేదు. ఇప్పటికే వ్యవసాయానికి ఎలాంటి సాయమూ చేయని కూటమి ప్రభుత్వం.. రైతులకు సంబంధించిన భూ సమస్యల పరిష్కారంపై కూడా దృష్టి సారించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా గ్రామాల్లో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ప్రారంభం కాకపోవడంతో నేటికీ రైతులు ఇబ్బంది పడుతున్నారు. కూటమి సర్కార్ కొలువుదీరి ఆరు నెలలు గడిచినా గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని బూచిగా చూపుతూ రైతుల సహనాన్ని పరీక్షిస్తోంది. జిల్లా వ్యాప్తంగా భూములను రీ సర్వే చేసిన గ్రామాల్లో గత అక్టోబర్ 22వ తేదీ నుంచి ప్రభుత్వం సభలు నిర్వహించింది. ఆయా సభల్లో రైతుల నుంచి సమస్యలపై వచ్చిన అర్జీలకు పదిహేను రోజుల్లో పరిష్కారం చూపుతామని చెప్పింది. అధికారులు సైతం ప్రగల్బాలు పలికారు. కానీ, ఆయా సభల్లో కేవలం గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని విమర్శించేందుకే ప్రాధాన్యత ఇచ్చారు. సదస్సులు ముగిశాయి. ప్రస్తుతం రైతుల సమస్యలకు పరిష్కారం చూపుతున్నారా..? అంటే అదీ లేదు. కేవలం అర్జీలు తీసుకుని బుట్టదాఖలు చేశారు. ఆయా గ్రామాల్లో రిజిస్ట్రేషన్ల ఊసే లేకుండా చేశారు. దీంతో రైతులు వ్యవసాయానికి రుణాలు తీసుకోవడానికి కూడా లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



అమ్మనబ్రోలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

ఎల్‌పీ నంబర్‌పై రిజిస్ట్రేషన్లకు అనుమతించినప్పటికీ తప్పని తిప్పలు...

భూముల రీ సర్వే చేసిన గ్రామాల్లో ఎల్‌పీ నంబర్లపై రిజిస్ట్రేషన్లు చేసేందుకు ప్రభుత్వం సూత్రప్రాయంగా అంగీకరించింది. ఆ మేరకు కలెక్టర్ నుంచి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలకు ఉత్తర్వులు అందాయి. రెవెన్యూ శాఖ కూడా రిజిస్ట్రేషన్ చేయాలని మార్గనిర్దేశం చేసింది. అయితే, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో మాత్రం రిజిస్ట్రేషన్‌లు కావడం లేదు. రిజిస్ట్రేషన్, రుణాల కోసం బాండ్లు చేసే సమయంలో కనీసం స్లాట్ బుక్ చేసేందుకు ఎల్‌పీ నంబరు తీసుకోవడం లేదు. పోనీ సర్వే నంబరుపై రిజిస్ట్రేషన్ చేయిద్దామా అంటే అదీ లేదు. ఈ సర్వే నంబరు నిషేధిత జాబితాలో ఉందని చూపుతూ రిజిస్ట్రేషన్లను తిరస్కరిస్తున్నారు. దీంతో రిజిస్ట్రేషన్లు ఎప్పుడు జరుగుతాయో అర్థంగాని పరిస్థితి నెలకొంది.

నేటికీ అందుబాటులోకి రాని వెబ్‌ల్యాండ్...

రిజిస్ట్రేషన్ జరగాలన్నా.. రీ సర్వే చేసిన భూముల్లో కరక్షన్లు చేయాలన్నా.. వెబ్‌ల్యాండ్ సైట్ ఓపెన్ కావాల్సి ఉంది. ప్రభుత్వం వెబ్‌ల్యాండ్‌ను తహసీల్దార్లకు లాగిన్ ఇచ్చి సరిచేయించాల్సి ఉంది. అసలు వెబ్‌ల్యాండే అందుబాటులోకి రాకపోవడంతో సభల ద్వారా వచ్చిన అర్జీలు తహసీల్దార్ కార్యాలయాలకే పరిమితమయ్యాయి. నాగులుప్పలపాడు మండలంలోని మొత్తం ఏడు రెవెన్యూ గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించగా, సుమారు 100కుపైగా అర్జీలు వచ్చాయి. రైతుల నుంచి వాటిని స్వీకరించడం మినహా ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయింది. ఇప్పటికైనా ప్రభుత్వం రైతుల అర్జీలు పరిష్కరించి రీ సర్వే గ్రామాల్లో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ జరిగేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.



ఎల్‌పీ నంబర్ ఓపెన్ కాని వెబ్‌ల్యాండ్ సైట్

త్వరలో పరిష్కారం

రీ సర్వే చేసిన గ్రామాల్లో కొన్ని చోట్ల సంతకాలు అవ్వలేదన్న కారణంతో గతంలో రిజిస్ట్రేషన్ నిలిచిన మాట నిజమే. అయితే, ప్రస్తుతం అవకాశం ఉన్న మేరకు రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. అంతేగాకుండా టెక్నికల్ సమస్య, జాయింట్ భూములు ఉన్నచోట కొంత మేరకు ఇబ్బంది ఉంది. త్వరలో పరిష్కారం అవుతుంది.

– ప్రవీణ్‌కుమార్, తహసీల్దార్, నాగులుప్పలపాడు

శాస్త్రోక్తంగా అయ్యప్ప పడిపూజ



పడిపూజలో పరాంకుశ రంగస్వామి, భీమనాథం నాగిరెడ్డి గురుస్వాములు



అయ్యప్ప అఖండ పడిపూజకు హాజరైన మాలధారులు

ఒంగోలు మెట్రో:

నగరంలోని మంగమూరు రోడ్డు గాంధీనగర్ వైఎస్సార్ విగ్రహం వద్ద శుక్రవారం రాత్రి భీమనాథం నాగిరెడ్డి గురుస్వామి ఆధ్వర్యంలో అఖండ పడి పూజా మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. తొలుత స్వామివారి మండపాన్ని చూడచక్కగా అలంకరించి గణపతి, అయ్యప్ప సుబ్రహ్మణ్య స్వామి ప్రతిమను ఏర్పాటు చేసి వేద పురోహితులు పరాంకుశం రంగస్వామి అయ్యప్ప, గణపతి, సుబ్రహ్మణ్యం మూలమూర్తులకు పూజాక్రతులను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అయ్యప్ప స్వామి పడిపూజకు మాల ధరించిన శివ స్వాములు, భవాని స్వాములు, అయ్యప్ప స్వాములు భజన కార్యక్రమంలో పాల్గొని స్వామి తీర్థప్రసాదాలు, అల్పాహారం స్వీకరించారు. పులి పోలురాజు గురుస్వామి, ప్రసాద్ గురుస్వామి, మధు గురుస్వామి, మాలధారులు పాల్గొన్నారు.

వివిధ అభివృద్ధి పనులపై అధికారుల సమీక్ష

సంతనూతలపాడు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం జెడ్పీ సీఈవో, మండల స్పెషల్ ఆఫీసర్ బీ చిరంజీవి మండల స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మండలంలో జరుగుతున్న ఉపాధి హామీ, తదితర పనులపై సమీక్షించారు. ఉపాధి పనులను వేగవంతంగా ప్రారంభించాలని, క్యాటిల్ షెడ్లు త్వరగా పూర్తి చేయాలని, హౌసింగ్ శాఖ టార్గెట్లు పూర్తిచేయాలని, పంచాయతీరాజ్ శాఖకు సంబంధించి సీసీ రోడ్లు, డ్రెయిన్ల పనులు వేగవంతం చేయాలని సూచించారు. తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు సూచించారు. అనంతరం మంగమూరు సచివాలయాన్ని సందర్శించారు. హౌస్ టూ హౌస్ జియో ట్యాగింగ్, ఎన్‌పీసీఐ లింకు అప్‌డేటింగ్, తదితర అంశాలపై సమీక్షించారు.



మండల అధికారులతో మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ చిరంజీవి



కూలిన బకింగ్‌హామ్ బ్రిడ్జి గోడ



ప్రమాదకరంగా బ్రిడ్జి

పొంచి ఉన్న ప్రమాదం

- ప్రమాదకరంగా బకింగ్‌హామ్ కాలువ బ్రిడ్జి
- రాత్రి వేళ ప్రయాణం ఆందోళనకరం
- అసౌకర్యానికి గురవుతున్న డ్రైవర్లు

కొత్తపట్నం: రాకపోకలతో రద్దీగా ఉండే బ్రిడ్జి ప్రమాదకరంగా మారింది. ఈతముక్కల–ఒంగోలు ప్రయాణికులకు బకింగ్‌హామ్ బ్రిడ్జి ఆటంకంగా మారింది. ఆ ప్రాంతానికి వచ్చే సరికి వాహన డ్రైవర్లు, ప్రయాణికులు భయపడాల్సిందే. ఎన్నో ఏళ్ల నుంచి సమస్యను పట్టించుకున్న నాయకులు, అధికారులు లేరు. ఆ బ్రిడ్జి నుంచే ఆర్టీసీ బస్సులు, స్కూల్ బస్సులు, రొయ్యల మెటీరియల్ వాహనాలు రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి ఉంది. రోజూ కూలీలు, ఉద్యోగులు సుమారు పది వేల మంది ఆ బ్రిడ్జిపై ప్రయాణం సాగించాల్సి ఉంది. బకింగ్‌హామ్ బ్రిడ్జి దగ్గరకు వచ్చేసరికి ప్రయాణికులు భయాందోళన చెందుతున్నారు. బ్రిటీష్ కాలంలో నిర్మించిన బ్రిడ్జి శిథిలావస్థకు చేరింది. ముఖ్యంగా రెండు వైపుల సైడ్ గోడలు పడిపోయి ప్రమాదాలు జరిగే విధంగా తయారయ్యాయి. 20–3–2020లో బీచ్‌కు వచ్చిన నలుగురు యువకులు స్పీడ్‌గా వచ్చి బకింగ్‌హామ్ బ్రిడ్జిని ఢీకొట్టి ప్రాణాలు కోల్పోయారు. ఒంగోలులో బేల్దారి పనులు, చిరు వ్యాపారాలు చేసుకుని జీవించే వారు ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొట్టడంతో అక్కడికక్కడే ఏడుగురు చనిపోయిన సంఘటనలు ఉన్నాయి. అప్పటి నుంచి నేటికీ అక్కడ మరమ్మతులు చేపట్టలేదు. కొత్త బ్రిడ్జి నిర్మించాలన్న ఆలోచన కూడా పాలకులకు లేకపోవడం గమనార్హం. అక్కడ నిత్యం ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. కొంచెం జారితే బకింగ్‌హామ్ కాలువలో పడిపోయే ప్రమాదం ఉంది. అధికారులు, పాలకులు స్పందించి నూతన బ్రిడ్జి నిర్మించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

బండి జారితే బకింగ్‌హామ్ కాలువలో పడాల్సిందే:

బకింగ్‌హామ్ బ్రిడ్జి నిర్మించి సుమారు 70 ఏళ్లు అవుతుంది. సైడు మార్జిన్ లేక వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. బ్రిడ్జికి రెండు వైపులా గోడలు పడిపోయాయి. కొంచెం స్లిప్ అయితే బకింగ్ కాలువలో పడిపోయి ప్రయాణికులు మరణించాల్సిందే. అధికారులు ఒక్కసారి ఆ ప్రాంతానికి వచ్చి పరిశీలిస్తే దాని రూపం తెలుస్తుంది. కనీసం రెండు గోడలకన్నా మరమ్మతులు చేపడితే బాగుంటుంది.

– తమలపాకుల చక్రవర్తి, మడనూరు



బ్రిడ్జి ఇలా..

ముస్లింలకు మంత్రి సత్యకుమార్ క్షమాపణ చెప్పాలి

ఒంగోలు ఒన్‌టౌన్: ముస్లిం సమాజానికి మంత్రి సత్యకుమార్ క్షమాపణ చెప్పాలని డీసీసీ అధ్యక్షుడు ఎస్‌కే సైదా శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మంత్రి శాసన మండలిలో మాట్లాడుతూ 100 ఎలుకలు తిన్న పిల్లి హజ్‌యాత్ర చేసిందని మాట్లాడటం, ముస్లిం మతాన్ని వారి మనోభావాలను కించపరచడమేనన్నారు. కాంగ్రెస్ పార్టీ ఈ వ్యాఖ్యల్ని తీవ్రంగా ఖండిస్తోందన్నారు. మంత్రి సత్యకుమార్ ఈ విధంగా మాట్లాడటం హేయమైన చర్యగా ఆయన అభివర్ణించారు. మంత్రి తన పదవికి వెంటనే రాజీనామా చేయాలన్నారు. మంత్రి రాజీనామా చేయకుంటే ముఖ్యమంత్రి వెంటనే మంత్రి వర్గం నుంచి తొలగించాలని సైదా డిమాండ్ చేశారు.

మహాధర్నాను విజయవంతం చేయాలి



గ్రానైట్ కార్మికులతో మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

చీమకుర్తి రూరల్: ఒంగోలులో ఈ నెల 26వ తేదీ నిర్వహించనున్న మహా ధర్నాను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు గ్రానైట్ కార్మికులకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం గ్రానైట్ క్వారీలో కార్మికులతో మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలపై సంయుక్త కిసాన్ మోర్చా, కేంద్ర కార్మిక సంఘాల పిలుపులో భాగంగా దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా ఒంగోలులో నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి పి.ఆంజనేయులు, కనకరాజు, బి.ప్రసాద్, పుల్లయ్య, అప్పలనాయుడు, గ్రానైట్ కార్మికులు పాల్గొన్నారు.

వైద్య విద్యార్థినికి రూ.61 వేల ఆర్థిక సాయం



ఆర్థిక సాయం చెక్కు అందిస్తున్న ఉద్యోగ సంఘాల నాయకులు

చీమకుర్తి: మెడికల్ సీటు సాధించిన చీమకుర్తికి చెందిన విద్యార్థిని బత్తుల నిత్యశ్రీకి చీమకుర్తి అంబేడ్కర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ తరపున రూ.61,400 అందించారు. శుక్రవారం చీమకుర్తి అంబేడ్కర్‌నగర్‌లోని ఎస్సీ ఉద్యోగుల సంఘ నాయకులు పారాబత్తిన గురవయ్య, ఎద్దు విజయ్‌కుమార్, బండ్ల డేవిడ్, దాసరి హనుమంతు, బత్తుల అర్జునరావు ఆధ్వర్యంలో నిత్యశ్రీ కుటుంబానికి నగదుకు సంబంధించిన చెక్కు అందించారు. కర్నూలు మెడికల్ కాలేజీలో మెడిసిన్ సీటు సాధించటంతో ట్యూషన్ ఫీజు చెల్లించేందుకు ఆర్థికంగా ఇబ్బంది పడుతుండగా ఉద్యోగులు ట్రస్ట్‌గా ఏర్పడి నగదు అందించారు. ఈ సందర్భంగా ఉద్యోగుల సంఘ నాయకులకు నిత్యశ్రీ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

మత్తు పదార్థాలతో జీవితం నాశనం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ సుబ్బారావు

చీమకుర్తి రూరల్: మత్తు పదార్థాలతో జీవితం నాశనమవుతుందని, వాటికి దూరంగా ఉండాలని చీమకుర్తి సీఐ సుబ్బారావు సూచించారు. మండలంలో ఆర్ఎల్ పురం పంచాయతీలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శుక్రవారం ఆయన సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడుతూ డ్రగ్స్, సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించారు. వాటి నివారణకు ఎలాంటి చర్యలు తీసుకోవాలో వివరించారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నేరగాళ్లు మొబైల్ ఫోన్లను హ్యాక్ చేసి బ్యాంక్ ఖాతాల్లో నగదు కాజేస్తున్నారని, కొత్త నంబర్ల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, మెసేజ్, లింక్లతో జాగ్రత్తగా ఉండాలని చెప్పారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టీడీపీ సోషల్ మీడియా కార్యకర్తలను అరెస్టు చేయాలి



మద్దిపాడు ఎస్సైతో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

మద్దిపాడు: వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఇతర నాయకుల వ్యక్తిత్వాన్ని కించపరిచేలా టీడీపీ సోషల్ మీడియా కార్యకర్తలు సోషల్ మీడియాలో చేస్తున్న పోస్టులపై చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ సీపీ మద్దిపాడు మండల అధ్యక్షుడు మండవ అప్పారావు ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్సైకి ఫిర్యాదు చేశారు. వైఎస్సార్ సీపీ ప్రధాన కార్యదర్శి వాకా కోటిరెడ్డి, వైస్ ఎంపీపీ పైడిపాటి వెంకట్రావు, బొమ్మల రామాంజనేయులు, సీనియర్ నాయకులు గుడ్డపాతల రవి, నాదెండ్ల మహేష్, సింగయ్య, పిచ్చిరాజు, దుడ్డు వినోదు, అన్వేష్, అశోక్, కాకర్లపూడి రజిని, తదితరులు పాల్గొన్నారు. అనుచిత పోస్టులు పెట్టిన టీడీపీ సోషల్ మీడియా కార్యకర్తలను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు.

గుండ్లాపల్లిలో మద్యం పట్టివేత

మద్దిపాడు: మండలంలోని గుండ్లాపల్లి గ్రామంలో అక్రమంగా మద్యం అమ్ముతున్న ప్రమోద్ అనే వ్యక్తిని మద్దిపాడు పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. అతని వద్ద నుంచి ఏడు క్వార్టర్ బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి చీమకుర్తి ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌కు స్వాధీనం చేయనున్నట్లు ఎస్సై తెలిపారు.